ప్రజాశక్తి
శుక్రవారం 17 మార్చి 2023

డిఎఫ్ఓకు అభినందనలు

డిఎఫ్ఓను అభినందిస్తున్న అటవీశాఖ సిబ్బంది

పార్వతీపురం రూరల్ : ఆలిండియా అటవీశాఖ అధికారుల ఆటల పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించిన జిల్లా ఫారెస్ట్ అధికారి జిపిపి ప్రసూనకు పలువురు అభినందనలు తెలిపారు. గురువారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో, జిల్లా అటవీ శాఖ అధికారులు ఆమెను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఆలిండియా స్థాయిలో హర్యానాలో జరిగిన అటవీ ఉద్యోగుల పోటీల్లో వెటర్న్ క్యారమ్స్ విభాగంలో డబుల్ స్కేటగిరీలో సిల్వర్ మెడల్ సాధించిన ఆమె గతంలో కూడా ఎన్నో పథకాలు సాధించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజర్ త్రినాధ్, సిబ్బంది మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి ప్రాజెక్టు

ఆర్థిక సంవత్సరం	కేటాయింపులు	విడుదల
2019-20	రూ.156 కోట్లు	రూ.13.64కోట్లు
2020-21	రూ.225.57కోట్లు	రూ.37.27కోట్లు
2021-22	రూ.199.70కోట్లు	రూ.1.35కోట్లు
2022-23	రూ.126.61కోట్లు	రూ.4.26
2023-24	రూ.80.84కోట్లు	రూ.????

జంఝావతి ప్రాజెక్టుకు రూ.39.60 లక్షలు, వెంగళరాయసాగర్‌కు రూ.14.72 లక్షలు, మడ్డువలసకు రూ.17.57లక్షలు కేటాయింపు

తాటిపూడి, ఆంధ్ర, పెద్దగెడ్డ, పెదంకలాం, డెంకాడ ఆనకట్టు, వట్టిగెడ్డ జలాశయాల ఆధునికీకరణకు కేటాయింపులు సున్నా.

సాగునీటి రంగంపై నిర్లక్ష్యపు వరద

- తోటపల్లికి రూ.556 కోట్లు అడిగితే రూ.80 కోట్లు కేటాయింపు
- రామతీర్థసాగర్‌కు రూ.50 కోట్లతో సరి
- ఆంధ్ర, తాడిపూటి, పెదంకలాం, వెంగళరాయ వంటి జలాశయాలకు మరీదారుణం
- పారిశ్రామికాభివృద్ధికీ కానరాని కేటాయింపులు
- నవరత్నాలతో సరి
- నిరాశపర్చిన రాష్ట్ర బడ్జెట్

రామతీర్థసాగర్

ఆర్థిక సంవత్సరం	కేటాయింపులు	విడుదల
2021-22	రూ.201 కోట్లు	రూ.28.49 కోట్లు
2022-23	రూ.124.50 కోట్లు	రూ.00.00
2023-24	రూ.50 కోట్లు	రూ.????

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వాసులను మరోసారి నిరాశకు గురిచేసింది. నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలకు కేటాయింపులు తప్ప, జిల్లా అభివృద్ధికి, తలసరి ఆదాయం పెంచేందుకు దోహదపడే విధంగా నిధులు కేటాయింపులు లేవు. ముఖ్యంగా 80శాతం ప్రజలు ఆధారపడే వ్యవసాయానికి అత్యంత కీలకంగా వున్న సాగునీటి రంగంపై ఎప్పటి మాదిరిగానే తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. తోటపల్లి, రామతీర్థసాగర్ సాగునీటి ప్రాజెక్టులకు వందల రూ.కోట్లు కేటాయించాల్సి వుండగా నాలుగో వంతు కూడా కేటాయించలేదు. అసలే మన జిల్లాలు పారిశ్రామికంగా వెనుకబడివున్నాయి. జ్యూట్ పరిశ్రమలు దాదాపు మూతపడ్డాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కొన ఊపిరితో నడుస్తున్నాయి. వీటిని ఆదుకునేందుకుగానీ, కొత్తపరిశ్రమల స్థాపనకుగానీ ఎలాంటి ప్రతిపాదనలు కూడా లేవు. మరోవైపు సేవారంగంలోనే జిల్లాకు తగిన కేటాయింపులు లేవు. ఎయిర్‌పోర్టుకు ఎప్పటి మాదిరిగానే అరకొర నిధులతో చేతులు దులుపుకున్నారు. 64వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరి స్తూనే 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తలపెట్టిన తోటపల్లి ప్రాజెక్టు పనులకు రూ.294.90 కోట్లు, సిఎడి డబ్ల్యుఎం పనులకు రూ.107.69 కోట్లు, భూసేకరణకు 46.38కోట్లు, అర్అండ్ఆర్ ప్యాకేజీకి రూ.107.06 కోట్లు చొప్పున మొత్తం రూ.556.03 కోట్లు కేటాయించాలని కోరుతూ ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపారు. బడ్జెట్‌లో కేవలం రూ.80.84కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో పెండింగ్ పనులకు రూ.73.13 కోట్లు, భూమి కొనుగోలుకు రూ.3.75కోట్లు, ఆర్అండ్ ఆర్‌కు రూ.3.96 కోట్లు విభజించారు. ఇప్పటికే నిధులు సరిపోక కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన పరిస్థితుల్లో తాజా కేటాయింపులు మరింత విస్మయానికి గురిచేస్తున్నాయి. పెండింగ్ పనుల వల్ల 58,757ఎకరాలకు సాగునీరు అందడం లేదు. తారకరామతీర్థసాగర్ జలాశయం, కాలువల నిర్మాణ పనులకు రూ.101.31కోట్లు, ఆర్ అండ్ఆర్‌కు రూ.175 కోట్లు, భూసేకరణకు రూ.38.24కోట్లు చొప్పున మొత్తం రూ.314.55కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.50కోట్లు కేటాయించారు. ఇందులోనూ పునరావాసానికి రూ.10కోట్లు పోతే పనులకు మిగిలినవి కేవలం రూ.40కోట్లే. ఈ నిధులు ఏమూలకూ సరిపోని పరిస్థితి. ఈ రెండు ప్రాజెక్టులు తరువాత అత్యంత ప్రతిష్టాత్మకమైన జంఝావతికి అంతంత మాత్రంగానే నిధులు కేటాయించారు. జంఝావతికి రూ.39.60లక్షలు, వెంగళరాయసాగర్‌కు రూ.14.72 లక్షలు, మడ్డువలసకు రూ.17.57లక్షలు కేటాయించారు. తాటిపూడి, ఆంధ్ర, పెద్దగెడ్డ, పెదంకలాం, డెంకాడ ఆనకట్టు, వట్టిగెడ్డ జలాశయాల ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారం లేదు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అదుగో ఇదిగో అంటున్న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అరకొర నిధులే మంజూరు చేసింది. జెఎన్‌టియు గురజాడ వర్శిటీలో అదనపు భవనాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ఎటువంటి నిధులు లేవు. ఇలా ఒకటి కాదు... రెండు కాదు.. ఏకంగా అన్ని అంశాల్లోనూ జిల్లాకు ఒరిగిందేమీ కనిపించలేదు. దళితులు, ఆదివాసీల జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించలేదని పలువురు విశ్లేషిస్తున్నారు. కేటాయింపులన్నీ నవరత్నాలు, జగనన్న, వైఎస్ఆర్ పేరిట ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల పద్దుల్లోనే కనిపిస్తున్నాయి. వివిధ శాఖలకు కేటాయింపులు కూడా తగ్గడంతో ప్రభుత్వం చెప్పున్న సుస్థిరాభివృద్ధి మేడిపండేనంటూ పలువురు విమర్శిస్తున్నారు.

అసమానతలు తగ్గించే బడ్జెట్

ప్రజలందరికీ మెరుగైన వైద్యం, పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు, రైతుల మోములో సంతోషం, అక్క, చెల్లెమ్మల కళ్ళలో ఆనందం ఇలా సమాజంలో అసమానతలు తగ్గించి, పేదరికాన్ని రూపుమాపే ధీటైనా బడ్జెట్ ఇది. అన్ని ప్రాంతాలను, అన్ని వర్గాలను సంతృప్తి పరిచే బడ్జెట్. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడేలా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి.

- మజ్జి శ్రీనివాసరావు,వైసిపి జిల్లా అధ్యక్షులు

ప్రజారంజక బడ్జెట్

రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ గురువారం శాసనసభలో వరుసగా ఐదవ సారి ప్రవేశపెట్టిన 2023-24 రాష్ట్ర ఆర్థిక బడ్జెట్ ప్రజా రంజకంగా ఉందని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. రాష్ట్రంలో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, కార్మిక, కర్షకుల అభివృద్ధికి ఖచ్చితంగా ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని అన్నారు.

అలజంగి జోగారావు, ఎమ్మెల్యే, పార్వతీపురం

ప్రజా వ్యతిరేక బడ్జెట్

యువత కు ఉద్యోగాలు ఉపాధి లేని, కొత్త పథకాలులేని, జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయించని ప్రజా వ్యతిరేక బడ్జెట్. రాష్ట్ర ప్రజలపై భారాలు వేసింది. అప్పులు ఫుల్ - అభివృద్ధి నిల్ బడ్జెట్. ఉపాధి నిధులు, ఎస్సీ, ఎస్టీ నిధుల్లో కోత పెట్టింది.

రెడ్డి వేణు, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఆఖరు బడ్జెట్టూ మోసపూరితమే

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలను సస్పెండ్ చేసి ప్రశ్నించే గొంతుకలు లేకుండా ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్ కూడా ఎప్పటిలాగే పూర్తిగా మోసంతో ఉంది. లక్షలాది రూపాయలు వివిధ రంగాలకు ఘనంగా కేటాయింపులు ప్రకటించినప్పటికీ ఐదేళ్లలో పెట్టిన ఖర్చులు ఏమాత్రం పొంతన లేకుండా ఉన్నాయి. ఇటువంటి మోసపూరిత బడ్జెట్‌తో ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసగించింది.

బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం

మండలి ఓట్ల లెక్కింపులో

ఉత్కంఠ

తొలి రౌండ్ పూర్తయ్యేసరికి టిడిపి, వైసిపి హోరాహోరీ

కౌంటింగ్ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. గురువారం విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను అధికార యంత్రాంగం చేపట్టింది. ఓట్లన్నిటినీ కట్టలు కట్టే ప్రక్రియ సుమారు సాయంత్రం వరకూ సాగింది. మొదటి రౌండ్ ఫలితం వెల్లడయ్యేసరికి టిడిపి వెయ్యి ఓట్ల మేర వైసిపిపై ఆధిక్యతను కనబర్చింది. పిడిఎఫ్ మూడో స్థానంలో ఉంది. మొత్తంగా 28 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఒక రౌండ్‌లో 28 వేల ఓట్లను లెక్కిస్తారు. మొత్తంగా 2 లక్షల పైచిలుకు ఓట్లు పోలైన సంగతి తెలిసిందే. గురువారం రాత్రి 9 గంటల వరకూ తొలి రౌండ్ ఫలితాన్ని సైతం అధికారులు వెల్లడించలేదు. రెండో రౌండ్ 9 గంటలకు ప్రారంభం అయ్యింది. రాత్రి 11 గంటలు దాటే సరికి 2 రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. 3 రౌండ్లు లెక్కింపు పూర్తయ్యే సరికి రాత్రి ఒంటి గంట దాటే అవకాశం ఉంది. ప్రతి రౌండ్‌కూ 2 గంటలకు పైనే సమయం పడుతోంది.

రాత్రి 9.30 గంటల సమయానికి వెలువడిన సమాచారం మేరకు..

టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు 8,854 ఓట్లతో ప్రథమ స్థానంలో నిలవగా వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ 7,850 ఓట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 5346 ఓట్లతో మూడో స్థానంలో ఉన్నారు. మొదట రౌండ్ ఓట్ల లెక్కింపు శ్రీకాకుళం జిల్లాకు సంబంధించినదని, అక్కడ టిడిపికి కాస్త మెజారిటీ ఉంటుందని తొలినుంచీ భావిస్తున్న విషయం చర్చనీయాంశమైంది. అనకాపల్లి ప్రాంతంలో కూడా టిడిపికి ఓట్లు అధికంగా వచ్చే వీలుందన్నది తెలుస్తోంది. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఒకటో రౌండ్ ఓట్ల లెక్కింపు అనంతరం మీడియాతో మాట్లాడుతూ చివరకు విజయం తనదే.. అంటూ ధీమా వ్యక్తం చేశారు. ఇంకా 1.70 లక్షల ఓట్లకు పైగా లెక్కించాల్సి ఉందన్నారు.

అధికారుల ఆకస్మిక ప్రకటనల గందరగోళం

మొదట రౌండ్ కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్వర్ణభారతి ఆడిటోరియంలో ఒక ప్రకటన చేస్తూ.. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థికి ఎదురుగా టిక్ మార్క్ పెట్టినా ఒకటి అని సూచించినా చెల్లుతుందని ప్రకటించారు. తొలుత ఈ అంశంపై క్లారిటీ ఇవ్వకుండా ఒక రౌండ్ పూర్తయ్యేసరికి ప్రకటించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమయ్యాయి.

మీడియాపై ఆంక్షలు

కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) స్పష్టంగా మీడియా ప్రతినిధులకు పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్దకు నేరుగా వెళ్లేందుకు పాస్‌లను మంజూరు చేసినా కౌంటింగ్ జరిగే స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోకి మీడియా వారిని అధికారులు అనుమతించలేదు. గతంలో మూడు దఫాలుగా మీడియా ప్రతినిధులను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించారు. 2023లో మీడియాపై ఆంక్షలు విధించడం, లోపలకి వెళ్లాలని ప్రయత్నించే వారితో పోలీసులకు ఘర్షణలకు దిగడం జరిగింది. స్వర్ణభారతి స్టేడియం మొదటి గేటు వరకే గురువారం మీడియాను అనుమతించారు. దీంతో సమాచారం కోసం మీడియా నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

పలుచోట్ల వర్షాలు

ఉరుములు, మెరుపులు

జిల్లాలో పలుచోట్ల గురువారం సాయంత్రం తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు కురిశాయి. ఉత్తర తమిళనాడు నుంచి కర్నాటక మీదుగా కొంకణ్ తీరం వరకు అల్పపీడనం ద్రోణి కొనసాగడంతో రాబోయే మూడురోజులు పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం జిల్లాలో పలుచోట్ల ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ మండలాల్లో భారీ వర్షాలు కురవగా, వీరఘట్టం, పార్వతీపురం, మక్కువ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. మినప పంట మట్టించేందుకు సిద్ధంగా ఉన్న రైతులు ఈ వర్షంతో ఇబ్బంది పడుతున్నారు. కురుపాం మండలం బియ్యాలవలసలో సచివాలయం పక్కనే ఉన్న కొబ్బరిచెట్టుపై పిడిగుపడింది. ఈ సమయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

ఐదు నెలల తర్వాత గుమ్మలక్ష్మీపురం మన్యంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళన చెందారు. మండుతున్న ఎండల కారణంగా వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనం కలిగించింది. వర్షంతో పాటు పలుచోట్ల పిడుగులు కూడా పడ్డాయి. పోడు వ్యవసాయానికి ఈ వర్షం ఎంతగానో మేలు చేస్తుందని గిరిజన రైతులు చెబుతున్నారు. గుమ్మలక్ష్మీపురం, లక్కగూడ, ఇరిడి, పి. ఆమిటి తదితర ప్రాంతాల్లో గంట పాటు భారీ వర్షం కురిసింది. శుక్రవారం నుంచి జరగబోయే కైలాసనాథ యాత్ర ఏర్పాట్లకు ఈ వర్షం అడ్డంకిగా మారింది.

కురుపాంలో కొబ్బరిచెట్టుపై పడ్డ పిడుగు

కొమరాడలో కురుస్తున్న వర్షం

కొమరాడ : మండలంలో కురిసిన వర్షంతో ప్రజలు ఒక్కసారిగా ఉపసమనం పొందారు. మేఘాలు కమ్ముకుని గాల్లుతో కూడిన భారీ వర్షం పడింది. కొమరాడ తదితర గ్రామ ప్రాంతాల్లో వర్షంతో పాటు ఒడుగుల్లు పడ్డాయి.

జియ్యమ్మవలస : తుఫాన్ ప్రభావంతో మండలంలో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నువ్వుల పంటకు వర్షం ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

కురుపాం : కురుపాంతో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం సుమారు 40 నిమషాలు పాటు పడింది. ఇంతవరకు ఎండలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న సమయంలో ఈ వర్షం పడటంతో ఉపశమనం పొందారు. కాగా జీడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీడి పంట పిందె, కాయ సమయంలో వర్షం పడడం వల్ల జీడి పంట బాగా వస్తాదని రైతులు ఆశాభావం వక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా బియ్యాలవలస సచివాలయం సమీపంలో కొబ్బరి చెట్లపై పిడుగు పడింది. ఆ సమయంలో సచివాలయ సిబ్బంది విధులు ముగించుకుని వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

అన్నదాతలు ఆందోళన

వీరఘట్టం: మండలంలోని గురువారం మధ్యాహ్నం నుంచి ఆకాశంలో మబ్బులు, చల్లని గాలులు వీయడంతో అన్నదాతలో తీవ్ర ఆందోళన మొదలయ్యింది. నడుకూరు, దశమంతపురం, చలివేంద్రి, సంత నర్సిపురం, విక్రంపురం గ్రామాల్లో ఇప్పటికి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఆరుగాలం కష్టించిన పంట తడిసి ముద్దవుతుందేమోనని భయంతో అన్నదాతల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పండి నాలుగు నెలలు కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు లేకపోవడంతో అన్నదాతల ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ప్రస్తుతం వీర ఘట్టంలో వర్షం పడడంతో అన్నదాతలు మరింత తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేసవి తీవ్రతపై అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

వేసవి తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్లతో గురు వారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందని అందుకు అనుగుణంగా జిల్లా స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. అవసరమగు ప్రదేశాలను గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు సిద్ధంగా ఉంచాలని అన్నారు. పాఠశాలల పని వేళల్లో మార్పు వంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలని ఆయన పేర్కొన్నారు. గృహ నిర్మాణాలపై అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ గృహాల దశల మార్పు పనుల్లో జిల్లా మంచి ప్రగతి కనబరిచిందని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

దేశానికి మోడీ, అదానీలతో ముప్పు : సిపిఎం

కలెక్టరేట్ : ప్రధాని మోడీ విధానాల వల్ల దేశానికి ముప్పు అని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అదానీకి లాభం చేసే ఒప్పందాలు, దేశానికి ముప్పు అన్న అంశంపై ఈనెల 14నుంచి 20వరకూ ప్రచారంలో భాగంగా స్థానిక సుందరయ్య భవనంలో దేశానికి అదానీ ముప్పు బుక్ లెట్, కరపత్రం గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ మోడీ విధానాల వల్ల అదానికి లాభం చేసే ఒప్పందాలు రద్దు చేయాలన్నారు. జగన్ విశాఖ సదస్సు వల్ల రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. జిల్లాలోని పలు అంశాలపై, మండల కమిటీలు విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.వెంకటరమణ, వి.ఇందిర, పి.రాజశేఖర్, బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పార్వతీపురం రూరల్ : నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని జిల్లా ఆసుపత్రి గురువారం నిర్వహించింది. ఇందులో భాగంగా నోటి ఆరోగ్యంపై అవగాహన ర్యాలీని స్థానిక ఆర్‌సిఎం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎంహెచ్ఓ జెండా ఊపి ప్రారంభిం చారు. చిన్నప్పటి నుంచి నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన పేర్కొన్నారు. నోటిలో పళ్లు ఎంతో పటుత్వమైన వని, అయితే తగిన పోషణ లేక అనారోగ్యం పాలు చేస్తున్నామని ఆయన చెప్పారు. ప్రతి రోజు రెండు పూటలా దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. సరైన శ్రద్ధ వహించకపోవ డం, పొగతాగడం వంటి కారణాల వల్ల నోటి కేన్సర్ తదితర రోగాలకు గురవుతున్నామని ఆయన పేర్కొన్నారు. బ్రష్ చేసే విధానంపైనా, వినియోగించే పేస్టుపైనా అవగాహన అవసరం అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, డిసిహెచ్ఎస్ డా.బి. వాగ్దేవి, వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసిసిబి బ్రాంచుల్లో రూ.2 కోట్లు హాంఫట్!

- బ్రాంచి మేనేజరే సూత్రధారి
- సహోద్యోగులను బలిపశువులు చేసిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని రెండు డిసిసిబి బ్రాంచుల్లో రెండు కోట్ల రూపాయల మేర నిధులు కాజేసిన బాగోతంలో ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. రామభద్రపురం, సాలూరు డిసిసిబి బ్రాంచుల్లో రూ.రెండు కోట్లకు పైగా నిధులు పక్కదారి పట్టాయి. కంచె చేను మేసిన చందంగా బ్రాంచి బ్యాంక్ నిధులకు రక్షకుడిగా ఉండాల్సిన బ్రాంచి మేనేజరే చాకచక్యంగా నిధులు కాజేసిన వైనం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సాధారణంగా సహకార బ్యాంకుల్లో ఖాతాదారుల డిపాజిట్లు గల్లంతు చేయడం, బినామీ పేర్లతో రుణాలు కాజేయడం వంటి కుంభకోణాలు జరుగుతుంటాయి. కానీ ఈ రెండు డిసిసిబి బ్రాంచుల్లో జరిగిన కుంభకోణం వినూత్న రీతిలో జరిగింది. సాలూరు, రామభద్రపురం డిసిసిబి బ్రాంచుల్లో మేనేజర్‌గా పనిచేసిన కె.మదన్‌కుమార్ ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారన్న చర్చ సర్వత్రా సాగుతోంది. తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో తన కింద స్థాయి ఉద్యోగుల అమాయకత్వం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేమి వంటి అంశాలను ఆసరాగా చేసుకుని రెండు కోట్ల రూపాయల మేర నిధులు మింగేసినట్లు తెలుస్తోంది. మేనేజర్ మదన్‌కుమార్ డిసిసిబి బ్రాంచుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు చెందిన ఎంప్లాయి ఐడిలతో బ్యాంక్ నిధులను దారి మళ్లించినట్లు స్పష్టమవుతోంది. తమ అధికారి ఎంప్లాయి ఐడి అడిగ్గానే అనుమానించకుండా ఇచ్చిన ఐదుగురు డిసిసిబి ఉద్యోగులు కూడా ఈ వ్యవహారంలో బలిపశువులయ్యారు. డిసిసిబి బ్రాంచిలకు సంబంధించిన సొమ్మును తెలివిగా తన సహోద్యోగుల ఎంప్లాయి ఐడిలతో వారి పేరిట ఖాతాల్లోకి మళ్లించి వాటి నుంచి తాను కోరుకున్న ఖాతాలకు దారి మళ్లించినట్లు తెలుస్తోంది. ఈ విధంగా రెండు బ్రాంచీలకు చెందిన రెండు కోట్ల రూపాయలకు పైగా నిధులు కైంకర్యం చేసినట్లు రుజువైంది. శాఖాపరమైన విచారణ జరగడం, దానిలో నిధులు పక్కదారి పట్టాయని నిర్ధారణ కావడంతో డిసిసిబి జిల్లా అధికారులు మేనేజర్‌తో పాటు కింద స్థాయి ఉద్యోగులు జి.రామకృష్ణ, ఆర్.వినీలా, సింహాచలం నాయుడు, శ్రీదేవి, శశిభూషణరావును సస్పెండ్ చేశారు. ఈ కుంభకోణం లో కింద స్థాయి ఉద్యోగుల పాత్ర ప్రత్యక్షంగా లేకపోయినా జిల్లా అధికారులు వారిపై వేటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్రాంచి మేనేజర్ మదన్ కుమార్ అడిగిన వెంటనే తమ ఎంప్లాయి ఐడి లను ఆయనకు ఇవ్వడమే వారు చేసిన పెద్ద తప్పుగా కనిపిస్తోంది. కింద స్థాయి సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు లేదన్న విషయం తెలుసుకున్న మేనేజర్ సులువుగా తన తెలివితేటలతో నిధులు పక్కదారి పట్టించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారానికే నిధులు మళ్లింపా?



ఈ వ్యవహారంలో మేనేజర్ మదన్ కుమార్ తన తెలివితేటలతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మళ్లించిన రెండు కోట్ల రూపాయలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దఫదఫాలుగా దారి మళ్లించిన సొమ్ములతో భూములు, సైట్లు కొనుగోలు చేశారనే ప్రచారం జరుగుతోంది. కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత మదన్ కుమార్ సహా ఆరుగురిపై వేటు పడింది. దీంతో మేనేజర్ కొంత సొమ్ము బ్యాంక్‌కు చెల్లించినట్లు తెలుస్తోంది. మిగిలిన సొమ్మును భూమి విక్రయించి చెల్లించే ప్రయత్నంలో వున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు

సాలూరు డిసిసిబి బ్రాంచిలో జరిగిన కుంభ కోణానికి సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టౌన్ పోలీస్ స్టేషన్లో డిసిసిబి అధికారులు ఫిర్యాదు చేశారు. దీనిపై టౌన్ ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ ఫిర్యాదు అందిందని, అవినీతి జరిగినట్లు ఆధారాలు అందజేయాలని కోరినట్లు చెప్పారు.

గిరిజన విద్యార్థిని ప్రథమ స్థానం

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో చదివిన గిరిజన విద్యార్థిని కె.తనూజ ఎంబిబిఎస్ హౌస్‌సర్జన్ పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు నెల్లిమర్ల మిమ్స్‌లో డాక్టర్ పట్టాను పొందారు. తనూజ చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తి కలిగి చురుకైన విద్యార్థినిగా పేరు గాంచింది. ఈమె తండ్రి కె.శ్రీనివాసరావు సాలూరు ఎటిడబ్ల్యుఒగా విధులు నిర్వహిస్తున్నారు. తనూజ చెల్లి గాయత్రి కూడా ప్రస్తుతం ఎయులో ఎంబిబిఎస్ చదువుతోంది. పీజీ డిగ్రీ పూర్తయిన తర్వాత తాను గిరిజన ప్రాంతంలో వైద్య సేవలందిస్తానని ఈ సందర్భంగా విలేకరులకు తెలిపారు.

ఘనంగా ఆలయ పున ప్రతిష్ట

వీరఘట్టం : మండల కేంద్రంలో శ్రీ కోటదుర్గ ఆలయ పున ప్రతిష్ట కార్యక్రమం గురువారం సర్వ జోషులు శ్రీ వెంకట లక్ష్మీ నరసింహ శర్మ యాజి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ పున నిర్మాణం కొరకు విరాళమిచ్చిన 250 మంది దంపతులచే ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

కురుపాం : విద్యార్థులకు తెలుగు బోధించేటప్పుడు వారికి అర్థమైన పద్ధతిలో ఉపాధ్యాయులు బోధించాలని రిసోర్స్ పర్సన్ టి.చంద్రశేఖరరావు అన్నారు. గురువారం కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల తెలుగు ఉపాధ్యాయులకు మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు జి.రామ గోవిందంత ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని భాషల కన్నా తెలుగు భాష, పదాలు రాయడానికి, మాట్లాడ్డానికి కష్టతరంగా ఉంటాయన్నారు. విద్యార్థులకు సులభమైన పద్ధతుల్లో వారికి అర్థమయ్యే రీతిలో బోధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిఆర్‌పి ఎ.మాధవి, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరితగతిగా పన్నులు వసూలు చేయాలి

కురుపాం : పంచాయతీల్లో పన్నులు త్వరితగతిగా వసూలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని పాలకొండ డివిజనల్ పంచాయతీ అధికారి జె.రాంప్రసాద్ అన్నారు. గురువారం మేజర్ పంచాయతీ సచివాలయం వద్ద మండలంలో గల 20 సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలంటే పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ అభివృద్ధికి పన్నులు కొంతమేరకు ఉపయోగపడతాయని, కావున పన్నులు వసూలు చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎవరూ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్య వంతంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు వైద్యం

కొమరాడ : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సరైన వైద్యం అందించేం దుకు ప్రవేశపెట్టిన కుటుంబ వైద్యుడు విధానంతో ప్రజల చెంతకు వైద్యం చేరుతుందని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి అరుణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని చినఖేర్జ సచివాలయ పరిధిలో బంజు కుప్పలో కుటుంబ వైద్యులు విధానంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వైద్య తనిఖీలు చేశారు. గ్రామంలో ఉన్న పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేస్తున్న వైద్యులు

అవసరమైన వారికి ఈసీజీ తదితర రక్త పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య అవసరాల నిమిత్తం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఏ చిన్న అనారోగ్యం వచ్చిన తక్షణమే ఆసుపత్రికి వచ్చి ప్రజలు వైద్య తనిఖీలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

కలెక్టరేట్ : హెచ్.ఐ.వి, ఎయిడ్స్ తమ జీవితాల్లోనికి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఎయిడ్స్ మరియు లెప్రసి) డా. శ్యామ్ కుమార్ సూచించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, సాతి స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా స్థానిక సబ్ జైల్‌లో హెచ్‌ఐవి, ఎయిడ్స్, సుఖవ్యాధులపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి.బాలాజీ హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమములో సబ్ జైల్ సూపరింటెండెంట్ అప్పలనారాయణ, ఐసిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి, జిల్లా ఆసుపత్రి సుఖ వ్యాధి చికిత్స కేంద్రం కౌన్సెలర్ యు.రామారావు, సాతి ప్రోగ్రామ్ కొ-ఆర్డినేటర్ ఎస్. మేనక పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కార్మికులు చలో కలెక్టరేట్

పార్వతీపురం టౌన్ : కలెక్టరేట్ వద్ద శుక్రవారం తలపెట్టిన చలో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా నాయకులు జి.వెంకటరమణ పిలుపు నిచ్చారు. మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, పర్మినెంట్ కార్మికుల సమస్యలపై గురువారం మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో కార్మికులతో కలిసి చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి తలపెట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగవంశం శంకర్రావు, మామిడి శివ, నాగవంశం నిర్మల, బంగారి రాజేష్, మామిడి శివ ప్రసాద్, నాగవంశం మల్లేష్, తాతబాబు, చిన్నికృష్ణ, నాగరాజు, ఉమా, రాజేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

గుమ్మలక్ష్మీపురం : మండు వేసవి దృష్టిలో ఉంచుకొని గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య నివారణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ కోరారు. గ్రామాల్లో పాడైన బోర్లు, రక్షిత నీటి పథకాలు మరమ్మత్తులు కోసం సర్పంచుల అకౌంట్లోకి నిధులు వెయ్యాలని అన్నారు. తద్వారా ఆయా గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి వీలుంటుందన్నారు.

గ్రంథాలయం తనిఖీ

పాలకొండ : స్థానిక శాఖా గ్రంథాలయాన్ని సబ్ కలెక్టర్ నూరుల్‌కమల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంఛార్జి గ్రంథాలయ అధికారి గణేష్ బాబును గ్రంథాలయం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడకు చదవడానికి ఎంత మంది వస్తున్నారు? ఎన్ని గంటలు వుంటుంది? అని అడిగారు. పరిసరాల పరిశుభ్రంగా లేవని, ట్యాంకు పరిసరాలు పరిశుభ్రంగా లేవని, ట్యాంకు నుండి నీరు బయటకు ఎలా వెళ్తుందని అడిగారు.

సిడిపిఒకు అంగన్‌వాడీల వినతి

పాచిపెంట : అంగన్‌వాడీల దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సిడిపిఒ బి.అనంతలక్ష్మికి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రభావతి, ఎన్.బంగారమ్మ, రమణమ్మ వినతిని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, పిఎస్‌ఎఫ్ రద్దు చేయాలని, అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైయస్సార్ సంపూర్ణ పోషనా మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహార సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులకు వయోపరిమిత తొలగించాలని కోరారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పని భారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిడిపిఒకు వినతినిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రశాంతంగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు


సీతంపేట: హాల్‌టిక్కెట్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నవ్య

ప్రజాశక్తి -విలేకరులు

గురువారం నుంచి ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పలు పరీక్షా కేంద్రాలను జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలను పరిశీలించి సంబంధిత అధికారులు పలు సూచనలు చేశారు.

సీతంపేట : స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలకు ఐటిడిఎ పిఒ బి.నవ్య గురువారం పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న అన్ని తరగతి గదులను పిఒ పరిశీలించారు. పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వకూడదని, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆమె వెంట చీఫ్ సూపరింటెండెంట్ విశ్వనాథం ఉన్నారు. అంతకుముందు ఇదే పరీక్షా కేంద్రాన్ని ఐటిడిఎ ఎడ్యుకేషన్ ఒఎస్‌డి యుగంధర్ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అలాగే స్థానిక గిరిజన బాలికల గురుకుల కళాశాల పరీక్షా కేంద్రాన్ని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సందర్శించారు. పరీక్షలు ఎలా జరుగుతున్నాయని పరిశీలించారు. సబ్ కలెక్టర్‌తో పాటు చీఫ్ సూపరింటెండెంట్ సూర్య కుమారి ఉన్నారు.

కురుపాం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు పరీక్షకు 383 మంది విద్యార్థులకు గానూ 364 మంది విద్యార్థులు హాజయ్యారు. అలాగే హిందీ పరీక్షకు గాను 22 మంది విద్యార్థులకు గాను 21 మంది విద్యార్థులు హాజరై అయ్యారని, ప్రత్యేక స్క్వాడ్ బృందం పరిశీలించినట్లు తెలిపారు.

తనిఖీల్లో బయటపడ్డ స్లిప్పులు

వీరఘట్టం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం ప్రధాన మెయిన్ గేటు వద్ద గురువారం పోలీసులు విద్యార్థులను తనిఖీ చేయగా స్లిప్పులు బయటపడ్డాయి. గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష సంబంధించి బాలుర విద్యార్థులను పోలీసులు, బాలికలను మహిళా పోలీసులు తనిఖీలు చేయగా విద్యార్థుల నుండి స్లిప్పులు బయట పడ్డాయి. వీటిని అక్కడే పోలీసులు కాల్చి బూడిద చేశారు. కంబర గ్రామానికి చెందిన అలజంగి వందన ఐదు నెలలు గర్భంతో పరీక్షా కేంద్రానికి వచ్చారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 252 మంది విద్యార్థులకు గాను ఆరుగురు విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని సిఎస్ పి. శంకర రావు తెలిపారు.

తనిఖీ చేస్తున్న పోలీసులు

నిర్మాణాలు వేగవంతం

పాలకొండ రూరల్ : మండలంలోని లుంబూరు వద్ద ఉన్న జగనన్న అర్బన్ లే అవుట్‌లో నిర్మాణాలను వేగవంతం చేయాలని కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు సూచించారు. శ్రీ కోటదుర్గ సచివాలయంలో గురువారం గృహ లబ్దిదారులు, వార్డు సెక్రటరీలు, వాలంటీర్లు, హౌసింగ్ సిబ్బందితోను ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు వేగవంతం అయ్యేవిధంగా ప్రణాళిక సిద్ధం చేసుకుని ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయాలన్నారు.

సిఎంకు రుణపడి ఉంటాం

ప్రజాశక్తి- పాలకొండ

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని నగరపంచాయతీ వైస్ ఛైర్మన్ పల్లా ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యాదవ కులానికి చట్టసభల్లో అవకాశం ఇచ్చి నర్తు రామారావు ఎమ్మెల్సీగా ఎన్నిక అయ్యేందుకు సహకారాన్ని అందించిన సిఎంకు యాదవులు అందరూ రుణ పడి ఉంటామని అన్నారు. తమ కులాన్ని బీసీ-బీలో చేర్పించాలని, అన్ని రంగాల్లో వెనకబడి ఉన్న తమకు మేలు చేయాలని కోరారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో 10వ తరగతి చదువుతున్న వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్వతీపురం ఐటిడిఎ డిప్యూటీ డైరెక్టర్ బి. సూర్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని పెద ఖర్జేల, ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆఫీస్ కార్యాలయంలో ఉన్న పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు రాస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల దగ్గర ఉన్న ఆన్సర్ సీటును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు బోర్డ్ పై పలు లెక్కలు సంబంధించిన ప్రశ్నలు వేస్తూ విద్యార్థులతో జవాబులు రాయించారు. విద్యార్థులు డిడి వేసిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పడంతో డిడి సంతృప్తి చెంది చప్పట్లు కొడుతూ విద్యార్థులను అభినందించారు. మిగిలి ఉన్న తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధన ప్రకారం విద్యార్థులకు సక్రమంగా మెనూ అమలు చేయాలని నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని సూచించారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులంతా అత్యధిక ఉత్తీర్ణత శాతం వచ్చే విధంగా కష్టపడే చదవాలని కోరారు. పదో తరగతి చదువుతున్న వెనుకబడిన విద్యార్థులకు సబ్జెక్టులపై భయం వీడేలా వారికి అవగాహన కల్పించాలని సిబ్బందిని సూచించారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, లక్ష్మీకాంతం, వార్డెన్లు రాజారావు, కృష్ణవేణి ఉన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ డివి రమణ

గణితంపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పదో తరగతి విద్యార్థులు గణితం సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు బేసిక్స్ బాగా అవగాహన కల్పించాలని డిఇఒ డాక్టర్ డివి రమణ సూచించారు. మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ, పిల్లలకు గణితం పట్ల భయం పోయేలా బోధించాలని, సింపుల్ ట్రిక్స్‌తో మాథ్స్ సరళంగా బోధించాలని సూచించారు. ముఖ్యంగా బేసిక్స్ బాగా నేర్పించాలని వివరించారు. స్కూల్ కాంప్లెక్స్‌లో పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన ఉంటే చాలా వరకు వ్యాధులను దరి చేరకుండా చేయవచ్చని జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన విద్యార్థులకు రక్తహీనత, సీజనల్ వ్యాధులు, పరిశుభ్రత, రోగనిరోధశక్తి పలు అంశాలపై ఆరోగ్య అవగాహన కల్పించారు. రక్తహీనతను ప్రాథమికంగా ఎలా గుర్తించాలి, వాటి లక్షణాలను వివరించారు. రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే లక్షణాలు గుర్తించిన కొంత మంది విద్యార్థులకు వైద్య సిబ్బందిచే హెమోగ్లోబిన్ పరీక్షలను చేయించి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు మింగించారు. వేసవికాలంలో వచ్చే అనారోగ్య లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉష్ణోగ్రతల వల్ల శరీరంలో నీటి శాతం తగ్గకుండా విద్యార్థులు ఎప్పటికప్పుడు నీరు తాగాలని సూచించారు. అలాగే పరిశుభ్రత, రోగనిరోధశక్తి పలు అంశాలపై అవగాహన కల్పిస్తే చాలా వరకు రోగాలను దూరం చేయవచ్చని డిఐఒ జగన్మోహనరావు సూచించారు. వైద్య, పాఠశాల సిబ్బంది సమన్వయంతో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. వెంకటనాయుడు, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

16,500 టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - వీరఘట్టం

చలివేంద్రి గ్రామం నుండి 16,500 టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం మండలంలోని చలివేంద్రి గ్రామాన్ని ఆయన సందర్శించారు. అన్ని గ్రామాల కంటే ఒక్క చలివేంద్ర గ్రామంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కే రాబర్ట్ పాల్ వివరించారని ధాన్యం కొనుగోలు మొత్తాలను రైతులు ఖాతాలో జమ అయ్యాయని రైతులకు వివరించారు. అవసరమైన విత్తనాలు ఇతర సామాగ్రి పంపిణీకి దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారిని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. గ్రామంలో కస్టమ్స్ హైర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో సమస్యల పట్ల ఆరా తీశారు. సాగునీటి కాలువ మరమ్మత్తు అవసరం ఉందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మరమ్మతులు చేయటం వల్ల సాగునీరు అందుతుందని రబీ పంట వేయడానికి అవకాశం ఉంటుందని వివరించారు. జల వనరుల శాఖ అధికారితో చర్చిస్తామని కలెక్టర్ తెలిపారు. సచివాలయ సేవలపై ఆరా తీయగా అన్ని విభాగాల్లో సేవలు అందుతున్నయని సిబ్బంది కూడా సక్రంగా పనిచేస్తున్నారని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ సమస్యలు పరిష్కరించినందుకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

కలెక్టర్‌ను సత్కరిస్తున్న రైతులు

అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్

అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయుడని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధనకు అహర్నిషలు కృషి చేసి ఆంధ్రరాష్ట్ర ఆవిర్భానికి శ్రీకారం చుట్టిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములని కొనియాడారు. ఆయన త్యాగం అజరామరం అన్నారు. శ్రీరాములు చేసిన త్యాగం ఫలితంగా దేశ వ్యాప్తంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఆవిర్భావానికి కారణమైందన్నారు. పొట్టి శ్రీరాములు గొప్ప దేశ భక్తుడు అని, మహాత్మా గాంధీ ప్రభావానికి లోనై ఉద్యోగాన్ని వదిలి అనుంగ శిష్యుడిగా చేరారని చెప్పారు. అమరజీవి అడుగుజాడల్లో నడవాలని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేటలో పొట్టి శ్రీరాములుకు నివాళ్లు అర్పిస్తున్న గ్రామస్తులు

పార్వతీపురంరూరల్ : ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని స్థానిక ఎస్పీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, జిల్లా ఆర్మడ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన...

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులుజి.వెంకట నాయుడు, కౌన్సిలర్లు బి గౌరి నాయుడు, కోల మధు, తాతపూడి వెంకటరావు, సిరిపరపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి వాసవి క్లబ్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మమ్ములు విశ్వేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, గోవిందు, లక్ష్మణరావు, శ్రీనివాస్, వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు సంజీవనాయుడు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువత నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ నాయుడు మాట్లాడుతూ ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి ఆలయకమిటీ అధ్యక్షులు నేరల్లా మజ్జి బాబు, పెద్దలు కోట శ్రీరాములు, గొర్రెల శ్రావణ్‌కుమార్, పెంకిపరశురాం, కర్రి గౌరీశంకర్, మజ్జి సూర్యనారాయణ, s మహేంద్ర, పొందూరు మురళి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఆయన చిత్ర పటానికి కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

సీతంపేట : మండలంలో తూరాయిపువలసకు చెందిన సవర రామారావు (35) పురుగుల మందు తాగి మృతి చెందాడు. బుధవారం రాత్రి రామారావు భార్య శాంతిపై కోపంతో మనస్థాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన భార్య సీతంపేట ఏరియా ఆసుపత్రికి రామారావును తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ఎ.నీలకంఠరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రామారావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

మృతుడు రామారావు

లక్ష్మీనారాయణ మృతి తీరని లోటు

కురుపాం : మండలంలో కిచ్చాడకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు పైల లక్ష్మీనారాయణ మృతి పార్టీకి తీరనిలోటని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందిన సంఘటన తెలుసుకొని ఆయన మృతదేహం వద్దకు వెళ్లి ఆమె నివాళులర్పించారు. వైసిపిలో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా ముందుండే వారని, అటువంటిది ఆయన మృతి చెందడం పార్టీకి, ఆయన కుటుంబానికి తీరని లోటుని సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వైసిపి గ్రీవెన్స్ సెల్ విభాగాల జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, కురుపాం మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

మరో ఐదుగురికి నోటీసులు

గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలస మండలానికి చెందిన టిడిపి అరుకు పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి డొంకాడ రామకృష్ణతో పాటు మరో ఐదుగురు టిడిపి నాయకులకు 41ఎ కింద నోటీసులు ఇచ్చి విడుదల చేశామని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్సీ ఎలక్షన్ రోజున పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే నేపథ్యంలో 41ఎ సెక్షన్ పై కేసు నమోదు చేశామన్నారు. గురువారం వారికి 41ఎ నోటీసులు ఇవ్వడం జరిగిందని అన్నారు.

బైక్‌పై చెట్టు కూలి వ్యక్తికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని పి.ఆమిటి కూడలి వద్ద బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తిపై చెట్టు పడడంతో తీవ్ర గాయాలు పాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పి.ఆమిటి జంక్షన్ వద్ద ఉన్న చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నిప్పు పెట్టారు. గురువారం ఉదయం జియమ్మ వలస మండలం కన్నపుదొరవలసకు చెందిన యుగంధర్ బైక్‌పై గుమ్మ వెళ్తుండగా పి.ఆమిటి జంక్షన్‌కు వచ్చేసరికి అతనిపై కాలిపోయిన భారీ వృక్షం ఒక్కసారిగా పడింది. దీంతో యుగంధర్ తలపై, వెన్నెముక భాగాల వద్ద తీవ్ర గాయాలయ్యాయి. 108 లో వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రధాన రహదారి వద్ద భారీ వృక్షం కూలడంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వెళ్లే సమయంలో ఈ ఘటన జరగడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. పరీక్షా కేంద్రానికి 9 గంటల్లోపు వెళ్లాల్సి ఉండగా ఈ ఘటన జరగడంతో విద్యార్థులు ఆందోళన పడ్డారు. వెంటనే స్పందించిన ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై విద్యార్థులను పరీక్షా కేంద్రానికి పంపించారు. రహదారిపై ఉన్న చెట్టున తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

ద్విచక్ర వాహనంపై పడిన చెట్టు

పార్వతీపురం రూరల్ : కొమరాడ మండలం మాదలంగికి చెందిన రాగాల సంతోష్ కుమార్ తన స్నేహితుడు మోహన్‌తో కలిసి గురువారం ద్విచక్ర వాహనంపై చిన్న మేరంగి వెళ్తుండగా, తుడుము గ్రామ సమీపంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి బలంగా ఢీకొనడంతో సంతోష్ కుమార్‌కు గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు వివరాలు నమోదు చేశారు.

గడప గడపకు వైయస్సార్ ఆసరా

కురుపాం : వైయస్సార్ ఆసరా వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఎపిఎం ఈవి కిషోర్ తన సిబ్బందితో కలిసి గురువారం స్థానిక మేజర్ పంచాయతీలో గల టకేష్ కాలనీలో మహిళా సంఘాలకు ఆసరా పథకంపై అవగాహన కల్పించారు. మొదటి విడతలో భాగంగా మార్చి 14 నుండి 17 వరకు మహిళా సంఘాల గడప గడపకు వెళ్లి సభ్యులకు వైస్సార్ ఆసరా అమలపై వివరిస్తామన్నారు.. రెండో విడతలో భాగంగా మార్చి 18 నుండి 20 వరకు స్వయం సహాయక సంఘం వారీగా వైస్సర్ ఆసరా పథకం అవగాహన కల్పించి, మూడవ విడతలో బాగంగా మార్చి 21, 23, 24 తేదీల్లో గ్రామ వార్డు పరిధిలో అన్ని స్వయం సహాయక సంఘాల సభ్యులతో వైఎస్సాఆర్ ఆసరా పథకం మీద సమావేశం ఏర్పాటు చేసి సభ్యులకు తెలియజేస్తామన్నారు. మార్చి 25న సిఎం రాష్ట్రస్థాయిలో ఆసరా మూడో విడత కార్యక్రమం ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ క్రాంతి పథక సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎపిఎం